యోహాను వ్రాసిన రెండవ లేఖ

1దేవుడు ఎన్నుకున్న అమ్మగారికి, ఆమె సంతానానికి,
పెద్దనైన నేను వ్రాస్తున్నది ఏమనగా, 2మీ పట్ల నాకు
నిజమైన ప్రేమవుంది. సత్యం మాలో శాశ్వతంగా ఉంది
కాబట్టే, నాకే కాకుండా సత్యం తెలిసినవాళ్ళందరికీ మీ పట్ల
ప్రేమ ఉంది.

3తండ్రి అయిన దేవుడు, తండ్రి యొక్క కుమారుడైన
యేసు క్రీస్తు మనకు సత్యంతో, ప్రేమతో ఇచ్చిన కృప, దయ,
శాంతి మనలో ఉండాలని కోరుతున్నాను.

4మీ సంతానంలో కొందరు, తండ్రి ఆజ్ఞాపించినట్లు
నిజాయితీగా జీవిస్తున్నారని తెలిసి నాకు చాలా ఆనందం
కలిగింది. 5అమ్మా! మొదటినుండి ఉన్న ఆజ్ఞనే నేను మీకు
వ్రాస్తున్నాను కాని, క్రొత్త ఆజ్ఞను వ్రాయటం లేదు. మనము
పరస్పరం ప్రేమతో ఉండాలని అంటున్నాను. 6ఆయన ఆజ్ఞల్ని
విధేయతతో పాటించటమే ప్రేమ. మీరు మొదటి నుండి
విన్నట్లు, ప్రేమతో జీవించుమని ఆయన ఆజ్ఞాపించాడు.

7యేసు క్రీస్తు శరీరంతో రాలేదనే మోసగాళ్ళు చాలామంది
ఈ ప్రపంచంలో వ్యాపించారు. వాళ్ళు మోసగాళ్ళు; క్రీస్తు
విరోధులు. 8మీరు పని చేయటంవల్ల లభించే ఫలాన్ని
వదులుకోకుండా జాగ్రత్త పడండి. సంపూర్ణమైన ఫలం
లభించేటట్లు చూసుకోండి.

9క్రీస్తు ఉపదేశాన్ని ఉల్లంఘించినవానిపై దేవుని అనుగ్రహం
ఉండదు. ఆ ఉపదేశానుసారం నడుచుకొనేవానిపై తండ్రి,
కుమారుల అనుగ్రహం ఉంటుంది. 10ఈ ఉపదేశం తమ
వెంట తీసుకురాకుండా మీ దగ్గరకు వచ్చినవాణ్ణి మీ ఇంట్లోకి
రానివ్వకండి. అలాంటివాణ్ణి పలకరించకండి. 11ఎవరైనా
అలాంటివాణ్ణి పలకరిస్తే, ఆ పలకరించబడినవాడు చేసిన
చెడ్డ పనుల్లో అతడు కూడ భాగస్థుడౌతాడు.

12నాకింకా ఎన్నో విషయాలు వ్రాయాలని ఉంది. కాని
కాగితాన్ని, సిరాను ఉపయోగించటం నాకు యిష్టం లేదు.
నేను మిమ్మల్ని కలిసి ముఖాముఖి మీతో మాట్లాడటానికి
ఎదురు చూస్తున్నాను. అప్పుడు మనకు సంపూర్ణమైన
ఆనందం కలుగుతుంది. 13దేవుడు ఎన్నుకొన్న మీ సోదరి
యొక్క సంతానం, వాళ్ళ అభివందనాలు మీకు తెలుపు-
తున్నారు.

నోట్స్